క్లుప్తంగా

ఆర్థిక సంఘం నిధుల కోసం వినతి



మండవల్లి: ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి ఏసోబురాజు, సర్పంచ్‌లు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం జేసీ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్‌కు, గ్రామ పంచాయతీలకు 10 నెలలుగా కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదని పేర్కొన్నారు. ఆర్థిక సంఘం నిధులు ఇప్పించవలసిందిగా వారు వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

త్రిమూర్తులు మృతి తీరని లోటు



గుడివాడరూరల్: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఎం నాయకులు ఆర్సీపీ రెడ్డి, నీలం మురళీకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో త్రిమూర్తులు మృతికి సంతాప సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రజని, లంకా సురేంద్ర, సమరం, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇనుప గడ్డర్ల ఏర్పాటు




తోట్లవల్లూరు: వల్లూరుపాలెం-కంకిపాడు రహదారిలో భారీ వాహనాలను నిలువరించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇసుక లారీలు అధిక లోడుతో ఇసుకను రవాణ చేస్తుండటంతో కంకిపాడు లాకుల భద్రతకు ముప్పు ఏర్పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ ఉన్నతాధికారుల సూచనతో కంకిపాడు లాకుల వద్ద, చినపులిపాక వద్ద ప్రధాన రహదారికి అడ్డంగా ఇనుప గడ్డర్లను ఇరిగేషన్ సిబ్బంది ఏర్పాటు చేశారు. లారీలను నిలువరించేందుకు వీటిని ఏర్పాటు చేయడం మంచిదే అయినప్పటికీ, చినపులిపాక, బొడ్డపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్సు రాకపోకలు ఆగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. కంకిపాడు వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలి



గుడివాడరూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే నిలుపుదల చేసి పాత మీటర్లను ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఏలూరు రోడ్డులోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద పలు ప్రజా సంఘాల నాయకులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బసవ అరుణ, సయ్యద్ నూరున్నిసా, నాగమణి, మూడెడ్ల ఉమా, బొత్స లక్ష్మి, బీవీ రమణ, ఉత్తర లక్ష్మి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా విమాదేవి



పెదపారుపూడి: పెదపారుపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె.విమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మొవ్వ ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన మల్లీశ్వరీ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోగం సురేష్ ఎంపీడీఓ విమాదేవి మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘కవిరాజు కళా భవనాన్ని బాగు చేయండి’



గుడివాడలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరిస్తున్న భద్రతా దళం సభ్యులు

గుడివాడరూరల్: కవిరాజు కళా భవనాన్ని బాగు చేసి, ఆ భవనంలో సాహిత్య, కళా కార్యక్రమాలు నిర్వహించి దానికి పూర్వ వైభవం తీసుకురావాలని భవిష్యత్ భద్రతా దళం సభ్యులు మున్సిపల్ అధికారులను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం మున్సిపల్ అధికారులకు భవనం గురించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భవనాన్ని బాగు చేయించి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా శుభ కార్యక్రమాలకు భవనాన్ని అద్దెకు ఇవ్వడం వలన మున్సిపాల్టీకి ఆదాయం వస్తుందన్నారు. ఈ విషయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భవిష్యత్ భద్రతా దళం సభ్యులు వైవీ మురళీకృష్ణ, తాహైర్ బాషా, జి.పూర్ణ చంద్రరావు, అక్బర్, నజీర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ‘స్పందన’

పామర్రు: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ప్రజా స్పందన కార్యక్రమం జరుగుతోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను తీసుకొచ్చిన వారికి వాటి పరిష్కారం దిశగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కురుమద్దాలి జగనన్న కాలనీలో రోడ్లను మ్యాపింగ్ ద్వారా అభివృద్ధి పరచాలని స్థానికులు కోరారని, వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామారావు, హౌసింగ్ ఏఈఈ పవన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సురేష్, మండల సర్వేయర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పామర్రులో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ రవికాంత్

కూటమిది వాయిదాల ప్రభుత్వం

వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించిన డీఎన్నార్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, నాయకులు

కైకలూరు: కూటమి ప్రభుత్వాన్ని వాయిదాల ప్రభుత్వంగా ప్రజలు భావిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ‘వైఎస్ జగన్ అంటే నమ్మకం .. చంద్రబాబు అంటే మోసం, చంద్రబాబు ఐదు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు’ అనే పుస్తకాన్ని కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీఎన్నార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు చుక్కలు చూపిస్తోందన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం 18 సంవత్సరాలకే ప్రతి మహిళకు నెలకు రూ.1,500 వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తానన్న చంద్రబాబు హామీ ఏమైందని ప్రశ్నించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తానని మోసం చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి అనేక వాయిదాలు వేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ విధానాల వలన విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని పేర్కొన్నారు.

పుస్తకంలో ఉన్న ప్రతి అంశాన్ని గ్రామాల్లో ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం నియమితులైన పలు గ్రామ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజుల సంఘ అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, మండవల్లి ఎంపీపీ, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్, పార్టీ రాష్ట్ర రైతు విభాగ సెక్రటరీ సయ్యపురాజు గుర్రాజు, ఏలూరు జిల్లా ఇంటిలెక్చువల్ (మేధావుల ఫోరం) అధ్యక్షుడు దుగ్గిరాల వెంకట నాగేశ్వరరావు (నాగు), బీవీ రావు, జిల్లా అర్గనైజేషన్ సెక్రటరీ జయమంగళ కాసులు, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు అర్జునరావు, యాక్టివిటీ సెక్రటరీ థామస్, జిల్లా ఎంప్లాయీస్ పెన్షనర్ల విభాగ అధ్యక్షుడు ఎలుగుల వేణుగోపాలరావు, మండల అధ్యక్షుడు రాంబాబు, రమేష్, ఏసోబురాజు, రామరాజు, నియోజకవర్గ నాయకులు దున్నా బేబీ, పండు ఆనంద రవిరాజు, గాలి బ్బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫలాలనిస్తున్న మొక్కలు



సీతా, రామా ఫలాలను చూపుతున్న ఉపాధ్యాయుడు

ముదినేపల్లి రూరల్: విద్యార్థుల్లో మొక్కల పెంపకంపై ఆసక్తి పెంచేందుకు మధ్యాహ్న భోజన కూరల అవసరాలు తీర్చేందుకు ఒక పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ నేడు ఫలాలనిస్తూ విద్యార్థుల్లో ఆనందాన్ని రేకెత్తిస్తుంది. మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాల్లో ప్రధానోపాధ్యాయుడు బేతాళ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు చక్రధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు కిచెన్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. ఇందులో కూరల మొక్కలతో పాటు ఫలాలనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. ఇందులో భాగంగానే పైనాపిల్ మొక్కలు నాటి ఫలాలను అందుకున్నారు. దీంతో పాటు సీతా, రామా ఫలాలు మొక్కలను నాటగా నేడు అవి కాపుకు వచ్చి ఫలాలను అందిస్తున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల ఒనగూరే ప్రయోజనాలు ప్రయోగాత్మకంగా విద్యార్థులకు తెలియజెప్పేందుకు గార్డెన్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: పామర్రు ఉప కేంద్రం పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనుండడంతో మంగళవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పామర్రు విద్యుత్ శాఖ ఏడీఈ సుందరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 132 కేవీ పామర్రు ఉప కేంద్రం పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: పెదపాలపర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముదినేపల్లి ఏఈ పూర్ణ చంద్రరరావు తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టేందుకు పెదపాలపర్రుతో పాటు పేరూరు, చౌటపల్లి ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



హోమియో వైద్యులతో కలసి యోగా ఉపయోగాలను వివరిస్తున్న సత్యనారాయణ

గుడివాడరూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతుందని యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక ఛైర్మన్ మాకాల సత్యనారాయణ అన్నారు. స్థానిక హోమియో ఆస్పత్రిలో అంతర్జాతీయ యోగా వారోత్సవాల్లో భాగంగా ఫిట్‌నెస్ మంత్ర అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోగాలు, రుగ్మతలు, అర్ధంతర మరణాలు, క్యాన్సర్లు, సర్జరీలు, అవయవ మార్పిడి భారీగా పెరిగాయన్నారు. దీనికి కారణం భారత సనాతన ఆరోగ్య విధానం యోగాకు ఆలస్యపు డబ్ల్యూహెచ్ గుర్తింపు కావడమే కారణమన్నారు. అతి తేలికగా ప్రజలకు ప్రధాని మోదీ ఫిట్‌నెస్ మంత్ర వాడుకునేలాగా ఇవ్వడం వలన కరోనా సమయంలో చాలా వరకు మరణాలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వరరావు, హోమియో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

రాజాబాబుకు ఘన నివాళి



రాజాబాబు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కారుమూరి, డీఎన్నార్

కలిదిండి(కైకలూరు): తాడినాడకు చెందిన ప్రముఖుడు అల్లూరి రాజాబాబు దశదిన కర్మ, సంతాప సభకు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సోమవారం విచ్చేశారు. రాజాబాబు చిత్ర పటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి కూసంపూడి కనకదుర్గ రాణి, కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, చినతాడినాడ సర్పంచ్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబాకు అభిషేకాలు

మండవల్లి: మండవల్లిలో కొలువైన శ్రీదత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో 15వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సాయిబాబాకు అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీపాద వల్లభ స్వామికి అత్యంత ప్రియమైన సిద్ధ మంగళ స్తోత్రం 108 సార్లు పారాయణం చేశారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బందారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

కూలీలపై రైతులు శ్రద్ధ చూపాలి



ఆక్వా రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

నందివాడ: మండలంలోని ఆక్వా సాగు చేసే ప్రతి ఒక్క రైతు వారి వద్ద పని చేసే కూలీలపై తప్పనిసరిగా శ్రద్ధ చూపించి వారికి విద్యుత్ సరఫరాపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత వాళ్లపై ఉందని గుడివాడ డీఎస్పీ పి.ధీరజ్ వినీల్ అన్నారు. మండలంలోని కొండపల్లి కన్వెన్షన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. ఆక్వా చెరువులపై పనిచేసే ప్రతిఒక్కరి బాధ్యత రైతులపై ఉంటుందని చెప్పారు. చెరువులకు సంబంధించిన విద్యుత్ వైర్లు, విద్యుత్ సరఫరాపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. వారికి తప్పనిసరిగా షూ, లెదర్ బ్లౌజులు, సేఫ్టీ జాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రతిక్షణం సీసీ కెమెరాలు పర్యవేక్షణలో పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అలాగే పురుగు మందులు కలిపేటప్పుడు మా స్కులు తప్పనిసరి అని వివరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సోమేశ్వరరావు, నందివాడ ఎస్ఐ కె.శ్రీనివాస్, ఫైర్ స్టేషన్ సిబ్బంది, ఫిషరీస్ అధికారి రవికుమార్, విద్యుత్ ఏడీఈ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కార్మికులకు ఉపాధి చూపాలి



తహసీల్దార్ కుసుమకుమారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తోట్లవల్లూరు: ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాకు అవకాశం కల్పించి, కార్మికులకు ఉపాధి చూపాలని పలువురు ఇసుక ముఠా కార్మికులు సోమవారం తహసీల్దార్ ఎం. కుసుమకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రుతు పవనాల రాకడ నిబంధనతో ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయటం సరికాదన్నారు. ఈ నిర్ణయంతో వందలాది మంది కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందని పేర్కొన్నారు. బడా వ్యాపారులు మాత్రం కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరుపుతూ లారీల ద్వారా భారీగా ఇసుకను తరలిస్తూనే ఉన్నారని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల తరఫున తటుకూరి రమణ, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, ఎం. శ్రీకాంత్, జాన్‌విల్సన్, బాలస్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాలో శ్రీసత్యసాయి ప్రేమ రథయాత్ర

చల్లపల్లి: శ్రీ సత్యసాయిబాబా శత జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శ్రీసత్యసాయి ప్రేమ రథయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాలను సంస్థ ప్రతినిధులు డాక్టర్ కె.చంద్రశేఖర్, ఆర్.రాధాకృష్ణ, వి.ప్రసాద్‌లు సోమవారం చల్లపల్లిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఈనెల 18వ తేదీన మచిలీపట్నం, పెడన, లంకపల్లి, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డతో మొదటి రోజు యాత్ర ముగుస్తుందన్నారు. 19న ఉదయం అవనిగడ్డలో ప్రారంభమై కోడూరు, నాగాయలంక మండలాల్లో పర్యటించి తిరిగి అవనిగడ్డ, చల్లపల్లి మీదుగా వక్కలగడ్డ, దేవరకోట, ఘంటసాల, కొడాలి, మొవ్వ, కూచిపూడి వరకూ సాగుతుందన్నారు. 20న కూచిపూడి, శ్రీకాకుళం, కృష్ణాపురం, పమిడిముక్కల, వీరంకిలాకు మీదగా భట్లపెనుమర్రు, పెడసనగల్లు, అయ్యంకి మీదుగా పామర్రు, పెజెంద్ర, గుడ్లవల్లేరు, గుడివాడ, జంక్షన్, పెదఅవుటుపల్లి మీదుగా గన్నవరం వరకూ వెళుతుందన్నారు. 21న గన్నవరం, బోళ్లపాడు, ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు, పోరంకి, యనమలకుదురు ప్రాంతాల్లో రథయాత్ర సాగుతుందన్నారు.

బల్లిపర్రు గురుకులంలో ప్రవేశాలు



అడ్మిషన్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రూతమ్మ, సిబ్బంది

పెడన: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి సీట్లు పొందిన వారికి అడ్మిషన్లు జరుగుతున్నట్లు బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రూతమ్మ తెలిపారు. సోమవారం గురుకులంలో అడ్మిషన్లను పరిశీలించిన ఆమె మీడియాతో మాట్లాడుతూ ఐదో తరగతిలో 40 మందికి పైగా చేరారన్నారు. ఆదేవిధంగా ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్‌కు సంబంధించి 62 సీట్లకు 57 భర్తీ అయ్యాయన్నారు. సెకండ్ లిస్ట్ విడుదలవ్వగానే మిగిలిన సీట్లు కూడా భర్తీ అవుతాయని ఆమె పేర్కొన్నారు.

వైభవంగా ముగిసిన ఉర్వేళమ్మ జాతర



కేరళ కళాకారులు, విద్యార్థుల కోలాటం



అర్ధరాత్రి వేళ ఉర్వేళమ్మ ఆలయంలో సంబరం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో మూడేళ్లకు ఒకసారి నిర్వహించే గ్రామదేవత ఉర్వేళమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం అర్ధ రాత్రి వరకు సాగిన గుడి సంబరాలు వైభవంగా ముగిశాయి. గత మూడు రోజులుగా జరిగిన పోతురాజు పోత, మదార్ సాహెబ్ ఊరేగింపు, గుడారం సంబరం, మద్దిరావమ్మ సంప్రదాయ సంబరం తదితర ఆధ్యాత్మిక వేడుకలు ముగియడంతో ఆదివారం రాత్రి పది గంటల నుంచి ఉర్వేళమ్మ పూజ, గుడి సంబరం జరిగింది. తొలుత 20 ముఠాల పెద్దల పర్యవేక్షణలో గ్రామస్తులు దీపజ్యోతుల అలంకారంతో కూడిన వేడి నైవేద్యాలను తలలపై పెట్టుకుని భారీ ఊరేగింపుగా ఉర్వేళమ్మ ఆలయంలో సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన కేరళ సంప్రదాయ కళాకారులు ప్రదర్శించిన చండీమేళం(సింగేరి మేళం) విన్యాసాలు జాతరలో ఆకట్టుకుంది. డీజే సౌండ్‌లతో యువత సందడి సృష్టించారు. అవనిగడ్డ సీఐ పి.యువకుమార్, నాగాయలంక ఎస్ఐ కలిదిండి రాజేష్ నేతృత్వంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, ఆయా ముఠా పెద్దలు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులపై దృష్టి సారించాలి

బుద్ధవరం(గన్నవరం): భూసారాన్ని పెంచుకునేందుకు రైతులు పచ్చిరొట్ట పైరులను సాగు చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.సునీల్ సూచించారు. మండలంలోని బుద్ధవరం పరిధిలో పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ సాగు చేస్తున్న పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పొలంలో భూసారం ఎంత పెరిగితే అందులో పండించే పంటలు అంతగా దిగుబడి అందిస్తాయన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం వల్ల రైతులకు నష్టం తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడరూరల్: తారకరామ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక ఇండియన్ బ్యాంక్ ఎదురుగా క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బచ్చు రాధాకృష్ణ, సభ్యులు పిన్నమనేని వేణుగోపాలరావు, తమ్మినేని రామ్మోహనరావు, దండమూడి సీతారామస్వామి, కొలుసు సతీష్, వీరమాచనేని శైలజ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాష్ట్ర శ్రీ భీమవరం శివ [illegible] వారి కోర్టు, ప.గో. జిల్లా.

M.V.O.P. No. 10/2024

[illegible]

To,

R1: [illegible] AP 16 BC [illegible]

R2: శ్రీ [illegible] 12-75. [illegible] విజయవాడ, కృష్ణాజిల్లా [illegible] AP 16 DC 4884.

మీరు పై తెలిపిన M.V.O.P.No. 10/2024లో పై తెలిపిన R1, R2 [illegible]

[illegible]

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

వాయిదా తేదీ : 25-06-2025

అడ్వకేట్స్

[illegible] B.com, B.L. సెల్: 98482 18185

[illegible] B.L. సెల్: 89791 23732.

[illegible]

సంచారజాతుల పిల్లలను బడిలో చేర్పించాలి



చిన్నారులు, తల్లిదండ్రులతో తహసీల్దార్‌ను కలిసి వస్తున్న దేవరపల్లి సురేష్‌బాబు

చల్లపల్లి: ఆధార్ కార్డులు లేకపోవటంతో 12 సంవత్సరాలు దాటినప్పటికీ సంచార జాతుల పిల్లలు పాఠశాలలకు వెళ్లి చదువుకోలేకపోతున్నారని, వారికి చుదవు చెప్పించేందుకు అధికారులు చొరవ చూపాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. స్థానిక కోమలాటాకీస్ ఎదురుగా ఉంటున్న మూడు కుటుంబాలకు చెందిన సంచార జాతుల పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి సురేష్‌బాబు తహసీల్దార్ డి.వనజాక్షిని సోమవారం కలిసి పరిస్థితి వివరించారు. ఆధార్ కార్డులు లేకపోవటంతో పిల్లలు చదువుకు దూరమవటమేకాక కొన్ని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు కూడా అందటంలేదని చెప్పారు. వారిలో సరైన చైతన్యం లేకపోవటం, వారి జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిబంధనలను సడలించి సంచార జాతుల ప్రజల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సురేష్‌బాబు కోరారు. బాలలకు కనీస విద్యాబుద్ధులు, సంక్షమం అందేలా ప్రతిఒక్కరూ చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్లిలలకు నివాస, జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు కృషిచేస్తానని తహసీల్దార్ చెప్పినట్లు సురేష్ తెలిపారు.

యూపీ పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్



అప్‌గ్రేడ్ అయిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో సర్పంచ్ రజిని

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలంలోని పెదపూడి యూపీ పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేశారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల హెచ్ఎం పి.కరుణాకరరెడ్డి సోమవారం వెల్లడించారు. గత విద్యా సంవత్సరం వరకు ఒకటి నుంచి 8వ తరగతి వరకు కొనసాగిన ఈ పాఠశాల ఈ ఏడాది 9వ తరగతి ప్రారంభమైంది. ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీ వరకు 124 మందితో కొనసాగిన ఈ పాఠశాల ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 145కు చేరుకుంది. అలాగే ఉపాధ్యాయ పోస్టులు నాలుగు పెరిగినట్లు హెచ్ఎం తెలిపారు. మొత్తం 11 మంది ఉపాధ్యాయులతో పాఠశాల కొనసాగుతుందని పేర్కొన్నారు. కాగ ఆతఈ పాఠశాలను సోమవారం గ్రామ సర్పంచ్ తాతా రజిని సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.